# 12 ఏరియాల్లో విజయం లక్ష్యంగా పనిచేయాలి

**సింగరేణి ఐఎన్‌టీయూసీ విస్తృత సమావేశంలో జనక్ ప్రసాద్**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో 12 ఏరియాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం గోదావరిఖనిలోని సాయి లీల విందు మందిరంలో సింగరేణి ఐఎన్‌టీయూసీ ఏడు ఏరియాల విస్తృత స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం దీర్ఘకాలంగా పోరాడుతున్న నాయకులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. కార్మిక జాతి పిత సంజీవరెడ్డికి రాజ్యసభ సభ్యత్వం, డా. జనక్ ప్రసాద్‌కు గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యత్వం కల్పించాలని కోరింది. సింగరేణి పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారంతోపాటు యూనియన్‌ను బలోపేతం చేయాలని జనక్ ప్రసాద్ సూచించారు. వైద్య మండలి ప్రక్రియలో అనిశ్చితి తొలగింపు, అనర్హత కారణంగా విధుల నుంచి తప్పుకున్న కార్మికుల సమస్యలు, సొంత ఇంటి కల, పేర్ల మార్పు, సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా, నూతన గనుల ప్రారంభం వంటి



అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సహకారం పొందుతూ, రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో 12 ఏరియాల్లో విజయం సాధించేలా కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సింగరేణి ఐఎన్‌టీయూసీ నాయకులు నరసింహరెడ్డి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్‌రావు, వికాస్‌కుమార్ యాదవ్, నరేందర్, శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై 18న సదస్సు

**రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి**

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి) :**



తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి, పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18న పెద్దపల్లిలో రైతు సదస్సు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె. విశ్వనాథ్, పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి లక్ష్మణ్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య మాట్లాడారు. ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెద్దపల్లిలోని ఎం.డి. గార్డెన్స్‌లో సదస్సు జరుగుతుందని తెలిపారు. ప్రధాన వక్తలుగా శాసనమండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం, మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ ఖాసీం, రైతు స్వరాజ్య వేదిక నాయకుడు కన్నెగంటి రవి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, సాగు ఖర్చులు పెరగడం, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందకపోవడం, సాగునీటి కొరత, పంట నష్టపరిహారం సకాలంలో అందకపోవడం, అప్పుల భారం పెరగడం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రతి పంటకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధర కల్పించాలని, గిట్టుబాటు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలను అరికట్టి నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు అందించాలని కోరారు. రైతులకు సకాలంలో రుణాలు, వడ్డీ రాయితీలు, పంట రుణమాఫీ, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన వారికి తక్షణ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందించాలని, కౌలు రైతులను గుర్తించి వారికి రైతు సంక్షేమ పథకాలు, రుణాలు, పంట నష్టపరిహారం అందించాలని కోరారు. రైతు ఆత్మహత్యలను నివారించేందుకు బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం, పునరావాసం కల్పించాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి, కనీస వేతనం, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను కేవలం ఎన్నికల హామీలుగా కాకుండా శాశ్వత పరిష్కారాల దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. సదస్సుకు రైతులు, కౌలు రైతులు, మహిళా రైతులు, వ్యవసాయ కార్మికులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, యువ రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్డి రాజుల సంపత్, పులిపాక రవీందర్, కాంపల్లి అంజన్న, ఎల్. భీమన్న, ఇందారపు రాజపోషం, బియ్యాల స్వామి, గొట్టె లింగన్న, పెర్క బానేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు



**రైతులను తక్షణమే ఆదుకోవాలి: బీజేపీ మండల అధ్యక్షుడు మూస నరసింహ**

**అగ్నిధార న్యూస్ సెప్టెంబర్ 06**

మహమ్మదాబాద్, (సెప్టెంబర్ 6): ఎండల తీవ్రతతో పంటలు ఎండిపోతూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వం తగిన స్థాయిలో స్పందించడం లేదని బీజేపీ మహమ్మదాబాద్ మండల అధ్యక్షుడు మూస నరసింహ ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, పంట నష్టపోయిన వారికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రస్తుతం రైతులకు సాగునీటితో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో పంట నష్టాలను అంచనా వేసి, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన పంటల బీమా హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.పంటల బీమా అమలులో జాప్యం చేయకుండా రైతులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హామీని అమలు చేయడంలో ఇబ్బందులు ఉంటే, కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను తెలంగాణలోనూ అమలు చేసి రైతులకు బీమా రక్షణ కల్పించాలని సూచించారు.ప్రకృతి వైపరీత్యాలు, అధిక ఉష్ణోగ్రతలు, కరువు పరిస్థితుల వల్ల పంటలు నష్టపోయిన సమయంలో బీమా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాలను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మూస నరసింహ డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వీడి తక్షణమే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కురువ కృష్ణ, మాజీ మండల అధ్యక్షుడు ప్రభు నాయక్, కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా జె. జయసూర్యనారాయణ



**అగ్నిధార న్యూస్ సెప్టెంబర్ 06**

మహమ్మదాబాద్ మండలం ధర్మాపూర్ పాఠశాల ఉపాధ్యాయుడు జె. జయసూర్యనారాయణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ కుష్బూ గుప్తా, ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి ఆయనకు పురస్కారం అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, వినూత్న బోధనా పద్ధతులు అవలంబించడం, పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం వంటి సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని జయసూర్యనారాయణ తెలిపారు. గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆయనను అభినందించారు.

## మహమ్మదాబాద్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

**అగ్నధార న్యూస్ మహమ్మదాబాద్ (సెప్టెంబర్ 06):**



మహమ్మదాబాద్‌లో శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 125 మంది శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు.వైద్య పరీక్షల్లో 26 మందికి కంటి పొరలు ఉన్నట్లు గుర్తించారు. వారికి శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు శిబిర నిర్వాహకుడు రహత్ అలీ తెలిపారు. గుర్తించిన 26 మందిని ఆసుపత్రికి తరలించి, సోమవారం ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. శస్త్రచికిత్స అనంతరం మంగళవారం వారిని తిరిగి గ్రామానికి తీసుకురానున్నట్లు వెల్లడించారు.ఈ శిబిరంలో డాక్టర్ మరియా, తులసి, అయాన్ తదితర వైద్య సిబ్బంది పాల్గొని ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ సభ్యుడు అనంతయ్య, మాజీ ఎంపీపీ శాంతిరంగ్య, మాజీ ఎంపీటీసీ భర్త వేణుగౌడ్, లాలు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్మనీ టెక్నాలజీ తో స్వచ్ఛమైన త్రాగు నీరు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండలంలోనీ గుండాల గ్రామంలో తాగునీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో పరిశుభ్రపరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో అందుబాటులోకి తీసుకువచ్చిన జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో గ్రామాల్లోని తాగునీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో శుభ్రపరుస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ట్యాంకుల్లో కొంతకాలంగా పేరుకుపోయిన మురికి, వ్యర్థాలు, ఇతర అవశేషాలను ప్రత్యేక యంత్రాల ద్వారా తొలగించి ట్యాంకులను పరిశుభ్రంగా మార్చారు. అనంతరం ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. తాగునీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల నీటి నాణ్యత మెరుగుపడటంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించవచ్చని, ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో , సర్పంచ్ శిరీష వెంకటయ్య, ఉప సర్పంచ్ , కృష్ణ,మరియు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని గ్రామస్తులు కోరారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**

**అగ్నిధార న్యూస్ ,(జగిత్యాల) :**

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల సమస్యలను పరిష్కరించి వారి ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి కొండల రాజేందర్‌కుమార్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో కౌన్సిల్ ప్రతినిధులు జగిత్యాల ఆర్టీసీ డిపోను సందర్శించి, డిపో మేనేజర్‌ను కలిసి సన్మానించారు. అనంతరం డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఉద్యోగులు విధుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అదనపు పనిభారం తగ్గించి, సురక్షితమైన పని పరిస్థితులు కల్పించాలని కోరారు. పదవీ విరమణకు ముందు కనీసం పది రోజులపాటు డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని డ్రైవింగ్‌కు బదులుగా తేలికపాటి విధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.ఇటీవల గుండె సంబంధిత సమస్యతో స్టెంట్ అమర్చిన లక్ష్మణ్ అనే డ్రైవర్‌ను పదవీ విరమణకు కొద్దిరోజుల ముందు విధులకు పంపగా బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్న సమయంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారని ఉద్యోగులు తెలిపారు. బస్సును పక్కకు నిలిపి ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ప్రతినిధులు డిమాండ్ చేశారు.ఉద్యోగులను వ్యక్తిగత కక్షలు, వేధింపులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కొండల రాజేందర్‌కుమార్ కోరారు. ఉద్యోగుల హక్కులు, ఆరోగ్యం, భద్రత పరిరక్షణకు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అండగా ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో కౌన్సిల్ పెద్దపల్లి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ ఆరిఫ్ అలీ, అంబాల నరేశ్, తాండ్ర శ్రీనివాస్, సాగర్, ప్రశాంత్, సైమన్, లింగమూర్తి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల సంక్షేమానికి చేయూతనివ్వాలి



**అగ్నిదార న్యూస్ ,(కరీంనగర్) :**

ప్రాచీన రంగస్థల కళలను కాపాడుతున్న కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం తగిన చేయూతనివ్వాలని తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపెల్లి సంపత్‌గౌడ్ కోరారు. ఆదివారం కరీంనగర్ సప్తగిరి కాలనీలోని కోదండ రామాలయంలో నిర్వహించిన సంస్థ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సావనపల్లి శ్రీనివాస్, నాయిని సత్యనారాయణరెడ్డి, వీర్నపల్లి కిషన్, పెద్దపల్లి జిల్లాకు చెందిన తాళ్లపల్లి రాజేశం గౌడ్, రావుల సదానందం, బొంగోని శంకర్‌గౌడ్, సిద్దిపేట జిల్లాకు చెందిన చల్లగొండ స్వామిరావు, గూళ్ల మొగిలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలు మండలాలకు అధ్యక్షులు, జిల్లా బాధ్యులు, కన్వీనర్లను నియమించారు.కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారు కూకట్ల తిరుపతి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రాజేశం గౌడ్‌తో పాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు.

## బీరప్ప స్వామి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలి

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**



గజ్వెల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలం చాట్లపల్లి గ్రామంలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప స్వామికి బోనాల సమర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ ?సందర్భంగా భూమల్ల లింగం మాట్లాడుతూ బీరప్ప స్వామికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు.బీరప్ప స్వామి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని, కుర్మ కులస్తులతో పాటు గ్రామానికి అష్టఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుకున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పెద్దమనిషి నర్సింలు, కొండయ్య, మాజీ ఎంపిటీసీ కావ్య దర్గయ్య, బండారి నర్సింలు, మల్లేశం, బూమల్ల మల్లయ్య, ఎల్లం, లింగం, కొండల్, బీరయ్య, కనకయ్య, రాజు, రవి, శ్రీకాంత్, బోగోర్ల ఐలయ్య, కొండయ్య, గుడిసె అనిల్, ఎగుర్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

